కాంగ్రెస్ పార్టీ టికెట్లు పొందిన అభ్యర్థుల వివరాలు నియోజకవర్గాల వారీగా..

నాంపల్లి



అభ్యర్థి పేరు: మహ్మద్ ఫిరోజ్ ఖాన్

పుట్టిన తేదీ : 10-ఏప్రిల్-1972
విద్యార్హతలు : ఇంటర్మీడియేట్
వృత్తి : రాజకీయం, ప్రవృత్తి : రియల్ ఎస్టేట్ వ్యాపారం, స్వగృహ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్

అనుభవం : సినీ నటులు చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీతో రాజకీయ ప్రవేశం చేశారు. నాంపల్లి నియోజకవర్గం నుంచి 2009లో పీఆర్పీ నుంచి పోటీచేసి రెండవ స్థానంలో నిలిచారు. ప్రజారాజ్యం కాంగ్రెస్‌లో విలీనమయ్యాక సినీ నటుడు చిరంజీవితో కలిసి 2011లో కాంగ్రెస్‌లో చేరారు. తదనంతరం 2014 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీలో చేరి నాంపల్లి టికెట్ పొందారు. టీడీపీ, బీజేపీ పార్టీల పొత్తులో భాగంగా నాంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఎంఐఎం చేతిలో ఓటమి పాలయ్యారు. మారిన సమీకరణల నేపథ్యంలో తిరిగి 2018 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చేరారు. నాంపల్లి నుంచి పోటీ చేసి 7 వేల ఓట్ల తేడాతో ఓటమిని చవిచూశారు. అనంతరం 2019 ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం జరిగే 2023వ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహ్మద్ ఫిరోజ్ ఖాన్‌కు మళ్లీ ఎమ్మెల్యే టికెట్‌ను కేటాయించింది.

చాంద్రాయణగుట్ట

అభ్యర్థి పేరు: బోయ నగేష్(నరేష్)



వయసు : 36
విద్యార్హత : ఇంటర్మీడియేట్
వృత్తి : రాజకీయం
ప్రవృత్తి : ట్రావెల్స్ వ్యాపారం

అనుభవం: ప్రస్తుతం చాంద్రాయణగుట్ట నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. 2009లో పార్టీలో చేరిక. నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఉప్పుగూడ డివిజన్ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం. 2021లో ఉప్పుగూడ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమి.

కుటుంబం: భార్య కవిత గృహిణి, కుమార్తె అక్షర, కుమారుడు హరిహరణ్‌లు పాఠశాల విద్యాభ్యాసం చేస్తున్నారు.

గోషామహల్

అభ్యర్థి పేరు: సునితా రావ్ ముదిరాజ్



విద్యార్హత : ఎం.ఏ. ఎల్‌ఎల్‌బీ
వయస్సు : 53
చిరునామా : ఆనంద్‌నగర్ కాలనీ ఖైరతాబాద్
కుటుంబ వివరాలు : భర్త డాక్టర్ మనోహర్, రిటైర్డ్ మెడికల్ అధికారి
కుమార్తెలు : సుప్రియ, ఎంఎస్ (వివాహిత) స్నేహ, ఎంఎస్ కంప్యూటర్ సైన్స్

రాజకీయ నేపథ్యం: 1987లో ఎన్‌ఎస్‌యూఐ కార్యదర్శి, 1989లో యువజన కాంగ్రెస్ కార్యదర్శి, 1999లో సిటీ కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ కార్యదర్శి, 2009లో ఏపీసీసీ కార్యవర్గ సభ్యురాలు, 2004-2012 వరకు ఏపీసీసీ కార్యదర్శి, 2018-2021 వరకు టీపీసీసీ సీనియర్ అఫీషియల్ స్పోక్స్‌పర్సన్, 2021 నుంచి ఇప్పటి వరకు టీపీసీసీ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు, 2022లో ఏఐసీసీ సభ్యురాలుగా నియామకం, 2023లో స్క్రీనింగ్ కమిటీ సభ్యురాలు.

యాకుత్‌పురా

అభ్యర్థి పేరు: కే.రవి రాజ్



వయస్సు: 49
విద్యార్హత : ఇంటర్మీడియేట్
కుటుంబం : వివాహితుడు, ఇద్దరు కుమారులు.
స్వస్థలం : లాల్‌దర్వాజ, హైదరాబాద్

రాజకీయ నేపథ్యం : సీనియర్ కాంగ్రెస్ నాయకులుగా ఉన్న రవిరాజ్ ప్రస్తుతం ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఎలక్షన్ కమిషన్ (ఐవైసీ)జడ్‌ఆర్ఓగా కొనసాగుతున్నారు. అలాగే ఇప్పటి వరకు ఐవైసీ ఏఆర్‌ఓగా, గ్రేటర్ హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, చాంద్రాయణగుట్ట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు.

బహదూర్‌పురా

అభ్యర్థి పేరు: రాజేశ్ కుమార్ పులిపాటి(రాహుల్)



వయస్సు : 36
విద్యార్హత : ఎంబీఏ.ఎల్‌ఎల్‌బీ
కుటుంబం : వివాహితుడు, ఒక కుమారుడు
స్వస్థలం : దూద్‌బౌలీ

రాజకీయ నేపథ్యం : టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్‌గా కొనసాగుతున్న రాజేశ్‌కుమార్ గతలో బహదూర్‌పురా నియోజకవర్గం బీ-బ్లాక్ అధ్యక్షుడిగా, గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా పని చేసిన ఆయన 2009లో జరిగిన కార్పొరేటర్ ఎన్నికల్లో రాంనాస్‌పురా డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగారు.

కార్వాన్

అభ్యర్థి పేరు: ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్‌హాజీరి



వయస్సు: 56
విద్యాఅర్హత: ఇంటర్మీడియేట్
వృత్తి: రాజకీయాలు
ప్రవృత్తి: సమాజ సేవా

రాజకీయ అనుభవం: 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. కార్వాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 2009, 2018 ఎన్నికల్లో కార్వాన్ నుంచి అసెంబ్లీకి పోటీ చేశారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ ఆస్తుల పరిరక్షణ కోసం డెక్కన్ వక్ఫ్ ప్రాపర్టీ ప్రొటెక్షన్ సొసైటీ ఏర్పాటు. మూడు దశాబ్దాలుగా నిరుపేదల కోసం సేవా కార్యక్రమాలు.

పని చేసే వారికి అన్యాయం

జంగ్ తెలంగాణ 2023

లంగర్‌హౌజ్: కిందిస్థాయి నుంచి పని చేసుకుంటూ వస్తున్న నాయకులకు కాకుండా పార్టీ పని చేయని వారికి ప్రాధాన్యం ఇస్తుందని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కార్వాన్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికను వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నాయకులు ఆదివారం లంగర్‌హౌజ్‌లో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. గతంలో టీడీపీతో సహా ఇతర పార్టీల తరఫున కార్వాన్ అసెంబ్లీకి పోటీ చేసిన అభ్యర్థిని ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించడంలో మతలబ్ ఏమిటని కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ ప్రశ్నించారు. పార్టీ కోసం దశాబ్దాలుగా పని చేస్తున్న వారిని పరిగణలోకి తీసుకోకపోవడం సరికాదని ఆయన అన్నారు. గతంలో మూడుసార్లు అసెంబ్లీకి పోటీ చేసిన ఉస్మాన్ బిన్ అల్‌హాజీరి ఎన్నికల సమయంలోనే ప్రజల్లో కనపడుతారని ఆయన ఆరోపించారు. ఉస్మాన్‌బిన్ అల్‌హాజీరికి ఇచ్చిన టికెట్‌ను వెనక్కి తీసుకోని పార్టీ కోసం పని చేసిన వారికే అభ్యర్థిగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు చంటిబాబు, గ్రేటర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ముంగి రఘుపాల్‌రెడ్డి, ఆకుల చంద్రశేఖర్, జియాగూడ, లంగర్‌హౌజ్, కార్వాన్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ప్రేమ్‌కిషోర్, రాంకుమార్, సంతోష్‌గౌడ్‌తో పాటు నాయకులు నర్సింహారెడ్డి, అబ్దుల్ హమీద్, గిరి, వినోద్‌సింగ్, సీనియర్ నాయకులు పరమానందం తదితరులున్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సెంట్రింగ్ కార్మికులకు మజ్లిస్ అండ

గోల్కొండ: సెంట్రింగ్ కార్మికులకు మజ్లిస్ పార్టీ అండదండలు సంపూర్ణంగా ఉంటాయని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. నవభారత్ అసోసియేషన్, కార్వాన్ సెంట్రింగ్ అసోసియేషన్ వారు కార్వాన్ బంజావాడిలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కౌసర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సెంట్రింగ్ కార్మికుల జీవితం ఎన్నో ప్రమాదాలతో కూడుకుందన్నారు. అనుక్షణం అభద్రత భావంతో సెంట్రింగ్ కార్మికులు పని చేస్తారని ఆయన అన్నారు. భవన నిర్మాణంలో సెంట్రింగ్ కార్మికుల పాత్ర ప్రధానమైనదని ఆయన అన్నారు. అయితే వీరికి పనికి తగ్గ ప్రతిఫలం దొరకడం లేదని ఆయన అన్నారు. సెంట్రింగ్ కార్మికులు సంఘటితంగా ఉండి శ్రమకు తగ్గ వేతనాల కోసం పోరాటం చేయాలని తాను ముందుండి వీరందరికీ అండగా ఉంటానని ఆయన అన్నారు. బీఆర్‌ఎస్ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి జీవన్‌సింగ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్ నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు ముత్యాల భాస్కర్, కోడూరి శ్రీధర్‌సాగర్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

మజ్లిస్ సెక్యులర్ పార్టీ: అక్బరుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: మజ్లిస్ పార్టీ సెక్యులర్ పార్టీ అని అందువల్లే ఇతర రాష్ట్రాల్లో సైతం తమ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని మజ్లిస్ శాసన సభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం నానల్‌నగర్ డివిజన్ ఖాదర్‌బాగ్‌కు చెందిన మజ్లిస్ సీనియర్ నాయకులు షబ్బీర్‌ఖాన్ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఒవైసీ మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలకు అత్యంత గౌరవం ఇస్తుందన్నారు. అంతేకాకుండా మజ్లిస్ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటూ వస్తున్నదని ఆయన అన్నారు. పని చేసే నాయకులకే కాకుండా కార్యకర్తలకు కూడా సరైన ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన అన్నారు. సామాన్య కార్యకర్తలు సైతం మజ్లిస్ ప్రజాప్రతినిధులుగా విజయలు సాధించారని ఆయన గుర్తు చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పని చేయాలని ఆయన అన్నారు.



అక్బరుద్దీన్ ఒవైసీతో షబ్బీర్‌ఖాన్

గోషామహల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అందరి సహకారంతో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధిస్తానని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునితరావు ముదిరాజ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న తనను పార్టీ అధిష్టానం అభ్యర్థిగా నియమించిందన్నారు. గతంలో మాజీ దివంగత మంత్రి ముఖేష్‌గౌడ్ హయాంలో 30 ఏళ్ల పాటు గోషామహల్ కాంగ్రెస్ కంచుకోట అని ఆమె అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరి సహకారంతో ముందు వెళ్తానన్నారు.

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ బస్తీ కమిటీలకు సర్టిఫికెట్ల అందజేత



జియాగూడ: జియాగూడలోని అన్ని బస్తీల్లో బీఆర్‌ఎస్ కమిటీలకు నూతనంగా సర్టిఫికెట్లను అందజేశామని జియాగూడ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం జియాగూడ బీఆర్‌ఎస్ కార్యాలయంలో డివిజన్‌లోని 11 బస్తీలకు చెందిన బీఆర్‌ఎస్ కమిటీ ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జరుగబోయే అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్‌ఎస్ బస్తీ కమిటీలు అకుంటిత దీక్షతో పనిచేస్తాయని తెలిపారు. హనుమాన్ స్ట్రీట్ కమిటీ సభ్యుడు నర్సింగ్‌రావు, దుర్గానగర్ సభ్యుడు దేవేందర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

‘తనిఖీలతో వస్త్ర వ్యాపారాలు దెబ్బతింటున్నాయి’

చార్మినార్: పోలీసుల తనిఖీలతో తమ వస్త్ర వ్యాపారాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని హైదరాబాద్ కట్‌పీస్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్, హైదరాబాద్ హోల్‌సేల్ అండ్ సిల్క్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పంకజ్‌కుమార్ అగర్వాల్ ఆవేదన వ్యక్తం చేశారు. పటేల్‌మార్కెట్, రికాబ్‌గంజ్, మదీనా మార్కెట్ తదితర హోల్‌సేల్ వస్త్ర వ్యాపారాలు కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్నాయని.. తమ రాష్ట్రానికి చెందిన వ్యాపారులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఇక్కడికి వస్తుంటారన్నారు. ప్రతి చిన్న విషయానికి పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తుండడంతో తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.



పంకజ్‌కుమార్ అగర్వాల్

ఆర్థిక సాయం



గౌలిపురా: లాల్‌దర్వాజా వెంకట్రావ్ స్మారక ఉన్నత పాఠశాలలో పాఠశాల యజమాన్యం బాధిత బాలికకు ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందజేసింది. గత వారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక బాలికను విచక్షణా రహితంగా కొట్టిన ఘటనలో బాలిక గాయాలు చూసి చలించిపోయిన పాఠశాల యజమాన్యం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని చికిత్స కోసం అందించింది. ప్రధానోపాధ్యాయురాలు రేణుకపై త్వరగా తగిన చర్యలు తీసుకోవాలని పాఠశాల యజమాన్యం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి ప్రసాద్‌రావు, మధుసూదన్, స్థానికులు రాజారత్నం, సురేశ్ బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ‘విజన్’ దేశానికే ఆదర్శం

అబిడ్స్: సీఎం కేసీఆర్ విజన్ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శమని గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్‌వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. పేద బడుగు వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధిని ఆలోచించే కేసీఆర్ పథకాలను దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ఆదివారం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో ప్రజలకు ఎంతో మేలు చేసే మేనిఫెస్టో అని ఆయన చిత్రపటానికి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పప్పు మాత్రే, అనిత, సంతోషి, ఆండాలు, ఆనంద్‌సింగ్, సునిల్ వ్యాస్ పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

కురుమలు అన్ని రంగాల్లో రాణించాలి



అవార్డులు పొందిన విద్యార్థులతో అధ్యక్షుడు యెగ్గె మల్లేశం, నాయకులు

అఫ్జల్‌గంజ్: కురుమలు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ ఆకాంక్షించారు. ఆదివారం అఫ్జల్‌గంజ్‌లోని సంఘం రాష్ట్ర భవనంలో కురుమ స్కిల్, ఎడ్యుకేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అవార్డులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..10వ తరగతి నుంచి వివిధ రకాల కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వారికి అవార్డులు ఇవ్వడం జరిగిందన్నారు.

ప్రైవేట్ టీచర్స్‌కు అవార్డులు ప్రదానం

నాంపల్లి: ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్, ఎన్‌డీఆర్ ఫౌండేషన్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఏసీగార్డ్స్‌లోని హఫీజ్ రెసిడెన్సీలో ఆదివారం సత్కార సభ జరిగింది. ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.బడేసాబ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజినీదేవి, ప్రగతిశీల వీరశైవ సమాజం అధ్యక్షుడు డాక్టర్ చింది బద్రీనాథ్, ప్రముఖ సామాజికవేత్త నక్క శ్రీనివాస్‌యాదవ్, ఎన్‌డీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నోముల మల్లేష్, ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ సమద్, తెలుగు భాషోపాధ్యాయులు కేవీ జనార్దన్ పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలతో డాక్టర్ కేవీ రమణాచారి

శాంతా వసంతా పురస్కారాలు ప్రదానం


నాంపల్లి: సమాజాన్ని ప్రభావితం చేసే ప్రక్రియల్లో సాహిత్యం గొప్పదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో శాంతా వసంతా ట్రస్ట్ ఆధ్వర్యంలో సాహిత్యానికి సేవ చేస్తున్న పలువురికి సాహితీ సేవా రత్న పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అన్నమయ్య సాహితీ పరిశోధకుడు ఆచార్య వేటూరి ఆనంద మూర్తికి డాక్టర్ కేఐ.వరప్రసాదరెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారం-2023 అందజేశారు. అలాగే ప్రముఖ భాషా పండితుడు డాక్టర్ తాడేపల్లి పతంజలి (2022), ప్రముఖ రచయిత్రి డాక్టర్ సి.మృణాళిని (2023)కి కోడూరు వేంకటరమణారెడ్డి సాహితీ సేవారత్న పురస్కారాలను అందజేశారు. మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. శాంతా వసంతా ట్రస్టు ద్వారా తెలుగు భాషా సాహిత్యం, సంగీతం, కళల వికాసానికి చేస్తున్న కృషిని ప్రశంసించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య అధ్యక్షతన జరిగిన సభలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, శాంతా వసంతా ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ కె.ఐ. వరప్రసాదరెడ్డి, సాహితీవేత్త జి.వి.శంకరరావు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో డాక్టర్ కె.ఐ.వరప్రసాదరెడ్డి

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: విశ్వనాథ వేయ్యిపడగల నవలలోని ధర్మదృష్టిని రచయిత్రి అద్భుతంగా ఆవిష్కరించారని తెలుగు విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ కె.యాదగిరి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి ఎన్.విజ్జులత రచించిన వేయ్యిపడగలు- ధర్మదృష్టి పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధర్మ మార్గంలో నడుస్తున్న నేటి సమాజానికి విశ్వనాథ రచనలు కనువిప్పు కలిగిస్తాయన్నారు. కవయిత్రి తాటికొండ కళ నిర్వహణలో సాగిన కవి సమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ బిక్కి కృష్ణ, సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, విమల సాహితీ సమితి అధ్యక్షులు విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ యాదగిరి తదితరులు

మహ్మద్ షరీఫ్‌కు సిల్వర్ మెడల్

సుల్తాన్‌బజార్: మిస్టర్ తెలంగాణ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన మహ్మద్ షరీఫ్ సిల్వర్ మెడల్‌ను గెలుచుకుని 2వ స్థానంలో నిలిచారు. కొంతకాలంగా మహ్మద్ షరీఫ్ ఎంతో కష్టపడి ఫిట్‌నెస్ సాధించి తెలంగాణ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో 2వ స్థానంలో గెలవడంపై అతడి కోచ్ కార్తీక్ హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి టైటిల్స్ ఎన్నో సాధించాలని మహ్మద్ షరీఫ్‌ను ప్రోత్సహించారు. రానున్న స్టేట్ లెవల్ చాంపియన్‌షిప్‌లో మహ్మద్ షరీఫ్ పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.



సీఎం కేసీఆర్‌ను కలిసిన ఆశీష్‌కుమార్ యాదవ్



అబిడ్స్: సీఎం కేసీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ కలిశారు. ఆదివారం బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ప్రకటించిన కేసీఆర్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో దేశంలో ఏ రాష్ట్రంలో ఉండదన్నారు. పేద, బడుగువర్గాలతో పాటు అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి చేసే మేనిఫెస్టో అని ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు.

• సన్మానం

గోల్కొండ: విద్యారంగంలో అత్యాధునిక పద్ధతులతో పాటు అత్యుత్తమమైన ల్యాబ్‌లు కలిగి ఉన్నామని అందువల్లే తమ కళాశాలలకు యూజీసీ వారు అటానమస్ విద్యా సంస్థగా గుర్తించారని షాదన్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మహ్మద్ షా ఆలమ్ రసూల్ ఖాన్ అన్నారు. షాదాన్ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ విద్యా సంస్థగా యూజీసీ గుర్తించిన సందర్భంగా మాజీ బల్దియా వార్డు సభ్యులు ఇంతియాజ్ ఆదివారం ఆయనను సన్మానించారు.



మహ్మద్ షా ఆలమ్ రసూల్ ఖాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు షురూ..

దేవీ శరన్నవరాత్రి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాల్లో, మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. 23వ తేదీ వరకు జరిగే ఉత్సవాల సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. - అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



కాచిబస్తీ మహంకాళి మందిర్‌లో..



ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో..



గౌలిపురాలో.. కైలాష్ గంగపుత్ర, సభ్యులు



సింహవాహిని మహంకాళి ఆలయంలో.. చైర్మన్ రాజేందర్‌యాదవ్ తదితరులు



మీరాలంమండిలో..



ఉప్పుగూడలో...



గుడిమల్కాపూర్‌లో..



మీరాలంమండిలో ఊంజల్ సేవకు హాజరైన భక్తులు